# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-07-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **దేశంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం ద్వారా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత పెరిగిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.**

**2.** **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు నంద్యాల జిల్లాలో పర్యటిస్తున్నారు.**

**3.** **ముఖ్యమంత్రి సహాయ నిధి బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తోందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.**

4. **తిరుమలలో వ్యర్థాల నిర్వహణకు తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి చర్యలు తీసుకుంటోదని పాలక మండలి చైర్మన్ బి.ఆర్.నాయుడు తెలిపారు.**

**5.** **అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నారు.**

==========================

దేశంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం ద్వారా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత పెరిగిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-25 అవార్డులను రాష్ట్రపతి ఈరోజు ప్రదానం చేశారు. సూపర్ స్వచ్ఛ లీగ్ నగరాలలో భాగంగా ఐదు విభాగాలలో మొదటి మూడు పరిశుభ్రమైన నగరాలు సహా పలు విభాగాలలో పురస్కారాలను ప్రదానం చేశారు. అనంతరం రాష్ట్రపతి ప్రసంగిస్తూ,

వాయిస్ 27 సెకన్లు

కాగా ఈ పురస్కారాలకు రాష్ట్రం నుంచి ఎంపికైన విజయవాడ, తిరుపతి, గుంటూరు, విశాఖపట్నం, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థల అధికారులు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారాలను అందుకున్నారు

-------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు నంద్యాల జిల్లాలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా జిల్లాలోని నందికొట్కూరు మండలం మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద విస్తరణ పూర్తైన హంద్రీనీవా సుజల స్రవంతిలో భాగంగా నీటికి జలహారతి ఇచ్చి నూతనంగా విస్తరించిన కాలువల నుంచి విడుదల చేస్తారు. అనంతరం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులతో సమావేశం కానున్నారని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

---------------------------

ముఖ్యమంత్రి సహాయ నిధి బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తోందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడ పార్లమెంట్ నియోజవకర్గ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ,

వాయిస్ .. 31 సెకన్లు

---------------------------

యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉద్యోగ మేళాను మంత్రి నిన్న ప్రారంభించారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నైపుణ్యాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళాలు నిర్వహిస్తోందన్నారు. వీటిని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువత ఎప్పటికప్పుడు నైపుణ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇకపై మచిలీపట్నం నియోజకవర్గంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఉద్యోగ మేళాలు నిర్వహిస్తామని మంత్రి వివరించారు.

---------------------------

తిరుమలలో వ్యర్థాల నిర్వహణకు తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి చర్యలు తీసుకుంటోదని పాలక మండలి చైర్మన్ బి.ఆర్.నాయుడు తెలిపారు. తిరుమల ఔటర్ రింగ్‌రోడ్డులో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్–ఐ.ఓ.సి.ఎల్, టీటీడీ సంయుక్తంగా నిర్మించనున్న ఎల్.పి.జి గ్యాస్ నిల్వ కేంద్రానికి బీఆర్ నాయుడు ఈ రోజు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రోజుకు 55 టన్నుల తడి వ్యర్థాలు తిరుమల ఉత్పత్తి అవుతున్నాయని, అందులో 40 టన్నుల వ్యర్థాలను ఐఓసిఎల్‌కు ఇస్తామని వెల్లడించారు. తద్వారా రోజుకు వెయ్యి కేజీల బయో గ్యాస్ ఉత్పత్తి అవుతుందని బి. ఆర్ నాయుడు తెలుపుతూ,

వాయిస్ ..32 .. సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 124వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

జాతీయ స్థాయిలో చేనేత, హస్తకళల విభాగంలో తిరుపతి జిల్లా మొదటి బహుమతిని పొందడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. తిరుపతిలో కలెక్టర్ నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్ర చేనేత రంగ విశిష్టతను తెలిపేలా పురస్కారాలు రావడం హర్షణీయమని చెప్పారు. జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ద్వారా ప్రాంతీయ కళాకారులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని కలెక్టర్ తెలుపుతూ,

వాయిస్ ... 34 సెకన్లు

-----------------------------

అంతర్జాతీయ న్యాయ వ్యవస్థను బలోపేతం చేసే ఉద్దేశ్యంతో ఈరోజు అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. రోమ్ శాసనాన్ని చారిత్రాత్మకంగా స్వీకరించిన రోజుకు గుర్తుగా జూలై 17వ తేదీని అంతర్జాతీయ న్యాయ దినోత్సవంగా జరపాలని 1998వ సంవత్సరంలో ఐక్యరాజ్య సమితి నిర్ణయించింది. అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ దినోత్సవంగా కూడా పిలుస్తారు. అంతర్జాతీయ నేరాలలో బాధితులకు న్యాయం జరిగేలా చేయడం, అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్‌కు మద్దతు ఇచ్చేలా ప్రోత్సహించడం వంటివి ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

-----------------------------

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యం- పీ4 కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా జిల్లాలో చేపట్టిన పీ4 కార్యక్రమం అమలుపై కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు శిక్షణ సదస్సును నిర్వహించారు.

-----------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు నష్టాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 152 పాయింట్ల నష్టంతో 82 వేల 481 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 31 పాయింట్ల నష్టంతో 25 వేల 180 వద్ద ట్రేడవుతోంది.

-----------------------------

దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈ రోజు తేలిక పాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్..20 సెకన్లు

======================